క్లుప్తంగా

చెంగాళమ్మ పరమేశ్వరికి వడ్డాణం బహూకరణ



బంగారు వడ్డాణాన్ని బహూకరిస్తున్న దాతలు

సూళ్లూరుపేట : పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరికి సూళ్లూరుపేటకు చెందిన చెంబేటి సతీష్‌బాబు, సురేఖ దంపతులు రూ.ఐదు లక్షల విలువైన బంగారు వడ్డాణం సమర్పించారు. వారు ఆలయానికి చేరుకుని వడ్డాణంను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లుకు అందజేశారు. అలాగే అమ్మవారికి విలువైన చీరను కూడా బహూకరించారు. కేఎస్ మెగా సూపర్‌మార్కెట్ అధినేత చిల్లకూరు కులశేఖర్‌రెడ్డి, భవాని, పర్వతరెడ్డి మురళీరెడ్డి, సుధ దంపతులు, మాదరపాక బాలసుబ్రమణ్యం, మాదరపాక జగన్మోహన్, డాక్టర్ కేఎస్ సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహా చండీ యాగం



మహా చండీయాగం చేస్తున్న ఉభయకర్తలు కొండేపాటి గంగాప్రసాద్-కోమలి దంపతులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఆదివారం గురుపూర్ణిమ సందర్భంగా మహా చండీయాగం, కలశాభిషేకాన్ని వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ప్రముఖ వ్యాపారవేత్త కొండేపాటి గంగాప్రసాద్, కోమలి దంపతులు వ్యవహరించారు. యాగంలో భాగంగా పూర్ణాహుతి చేశారు. గురుపూర్ణిమ ఉత్సవాల్లో భాగంగా 108 కలశాలను ప్రతిష్ఠించి పవిత్ర జలాలతో అమ్మవారిని అభిషేకించారు. పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో కలశాలను తీసుకుని అమ్మవారిని అభిషేకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తానంకి నానాజి తదితరులు పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌లో ఇసుక లోడింగ్ నిలిపివేత



ఇసుక స్టాక్ పాయింట్‌లో ఆగిపోయిన లోడింగ్

దొరవారిసత్రం : మావిళ్లపాడు గ్రామ సమీపంలోని ఇసుక స్టాక్ పాయింట్‌లో ఇసుక లోడింగ్‌ను నిలిపివేశారు. దీంతో వాహనదారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ పాయింట్‌లో శని, ఆదివారాల్లో ఇసుకను లోడ్ చెయ్యకుండా ఆపేయడంతో ఇసుక కోసం ట్రాక్టర్లు, లారీలను తీసుకువచ్చిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇసుక లోడింగ్ ఆపేయడం తగదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులను అడిగితే యంత్రాలను మరమ్మతులు చేయిస్తున్నట్టు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ చంద్రకళ

నాయుడుపేట టౌన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని సినీ నటుడు సూర్య అభిమానులు తెలిపారు. వారు ఆదివారం సూర్య పుట్టిన రోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 25 మంది యువకులు రక్తం దానం చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ చంద్రకళ, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ వెంకటరత్నం, డాక్టర్ సాయిప్రియ, గూడూరు బ్లడ్ బ్యాంక్ నోడల్ అధికారి డాక్టర్ సందీప్ శ్రీనివాస్, టెక్నికల్ సూపర్‌వైజర్ మౌలాలి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



అద్దాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని డీఎన్నార్ కమ్యూనిటీ హాలులో ఆదివారం ప్రగతి సేవా సంస్థ, సాయి ఎడ్యుకేషన్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 100 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి నెల్లూరులోని సునీల నేత్రాలయంలో వైద్యులు సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని సంస్థ నిర్వాహకులు కడివేటి చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు ధనుంజయరెడ్డి, చంద్రశేఖర్, సునీల, నాగార్జున, కరీముల్లా, రామక్రిష్ణ, విశ్రాంత ఎస్‌ఐ ప్రభాకర్, రమేష్, పెంచలయ్య, క్రిష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, శీను పాల్గొన్నారు.

చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తయ్యేనా..?



మీజూరు వద్ద ఆగిపోయిన చెక్‌డ్యామ్‌లు



వేలికాడు గ్రామ సమీపంలో అసంపూర్తిగా ఉన్న చెక్‌డ్యామ్

దొరవారిసత్రం మండలంలోని తీరప్రాంత గ్రామాల్లో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 20 ఏళ్ల క్రితం చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. అప్పట్లో పనికి ఆహారం పథకం కింద పనులు దక్కించుకున్న అధికార పార్టీ నాయకులు నిధులు మింగేసి పనులను అర్ధంతరంగా ఆపేశారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు ఈ పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో దొరవారిసత్రం, సూళ్లూరుపేట, చిట్టమూరు మండలాల్లోని 21గ్రామాల ప్రజల ఆశ అడియాసగానే మిగిలింది.

– దొరవారిసత్రం

- 20 ఏళ్ల క్రితం పనులు ప్రారంభం
- పట్టించుకోని నాటి టీడీపీ ప్రభుత్వం
- పనులు పూర్తయితే 8 వేల ఎకరాలకు సాగు నీరు
- తీర గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

దొరవారిసత్రం, సూళ్లూరుపేట, చిట్టమూరు మండలాల్లోని తీర ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరు పులికాట్ సరస్సులో కలిసి సముద్రంలోకి వెళ్లిపోతున్నాయి. వాటిని వినియోగించుకుంటే 21 గ్రామాల ప్రజలకు తాగునీటితో పాటు 8 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చు. అందుకోసం డీవీ సత్రం మండలంలోని తీర ప్రాంతాలైన మీజూరు, కారికాడు, వేలికాడు ప్రాంతాల్లో నాలుగు చెక్ డ్యామ్‌లు నిర్మించాలని స్థానిక నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో 2001లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెక్ డ్యామ్‌లు నిర్మించడానికి సుమారు రూ.2 కోట్లు మంజూరు చేసింది. అప్పట్లో పనికి ఆహారం పథకం కింద పనులు దక్కించుకున్న అధికార పార్టీ నాయకులు ఉన్నకాడికి నిధులు దోచేశారు తప్ప చెక్‌డ్యామ్ పనులు పూర్తి చేయలేదు. దీంతో చెక్ డ్యామ్ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఆ పనులను పూర్తి చేసేందుకు ఇరిగేషన్ శాఖ 2016–17లో మళ్లీ అప్పటి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేసింది. వన్యప్రాణి విభాగం అధికారులు పనులు అడ్డుకున్నారనే నెపంతో పనులు మళ్లీ ఆపేశారు. ఈ సమస్య జిల్లా స్థాయి అధికారుల దృష్టికి వెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఈ చెక్ డ్యామ్‌ల నిర్మాణం గురించి పట్టించుకోలేదు.

చెక్ డ్యామ్‌లు పూర్తయితే 8 వేల ఎకరాలకు సాగునీరు

తీర గ్రామాల్లో చెక్‌డ్యామ్ పనులు పూర్తయితే దొరవారిసత్రం, సూళ్లూరుపేట, చిట్టమూరు మండలాల్లోని 21 గ్రామాల్లో 8 వేల ఎకరాలకు పుష్కలంగా నీరు అందించవచ్చు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందుతుంది. అలాగే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. తీర గ్రామాల్లో సాగు నీరు లేక బీడుగా ఉన్న భూములను సాగులోకి తీసుకురావచ్చు. అదే విధంగా వివిధ ప్రాంతాల్లోని చెరువుల్లోకి నీరు చేరుతుంది. ప్రతి ఏటా సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం తప్ప నిధులు మంజూరైన దాఖలాలు లేవు. ఇప్పటికైనా ప్రభుత్వంతో చర్చించి నిధులు మంజూరు చేయించేందుకు స్థానిక నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చెక్ డ్యామ్‌ల నిర్మాణం రైతు కల



తీర ప్రాంతాల్లోని చెక్‌డ్యామ్‌ల నిర్మాణం దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల్లోని రైతుల కల. 20 ఏళ్లుగా పనులు పూర్తి కాలేదు. పనులు పూర్తయితే ఎన్నో వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. నాయకులు చొరవ తీసుకుని సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరు కోసం కృషి చేయాలి.

– వెంకటేష్, రైతు, మీజూరు

సాగు, తాగునీటి సమస్య తీరుతుంది



మీజూరు వద్ద చెక్‌డ్యామ్ పనులు పూర్తయితే సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల ప్రజలకు తాగునీటి సమస్య తీరుతుంది. అలాగే 8 వేల ఎకరాలకు నీరు అందుతుంది. పంటలు సమృద్ధిగా పండుతాయి. ప్రజల జీవన ప్రమాణం మెరుగు పడుతంది. ప్రభుత్వం స్పందించి చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తి చేయాలి.

– బాలరాజు, రైతు, కారికాడు

చిన్నమాంబట్టులో కావడి భక్తులు మొక్కుల చెల్లింపు

తడ: ఆడి మాసంలో వచ్చే కృత్తిక పర్వదినాన కావడి ధరించే భక్తులు చిన్న మాంబట్టులో వెలసిన గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో మొక్కులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ యాజమాన్యం, అన్నదాన ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ నెల 30న వచ్చే ఆడికృత్తిక రోజున గ్రామానికి వచ్చే కావడి భక్తులకు విఘ్నేశ్వర, రామాలయాల వద్ద మంగళవాయిద్యాలతో స్వాగతం పలికి శివాలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన అనంతరం వల్లీ సమేత సుబ్రమణ్య స్వామి ఆలయం వద్ద మొక్కులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నటుట్ పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కావడి మహోత్సవాన్ని నిర్వహిస్తామని, అనంతరం అన్నదానం చేస్తామని తెలిపారు.

ఘనంగా అగ్నిగుండ మహోత్సవం



అక్కగారిపేటలో అగ్నిగుండ మహోత్సవం

పెళ్లకూరు: మండలంలోని అక్కగారిపేటలో ఆదివారం శ్రీరుక్మిణి సమేత పాండురంగస్వామి స్వామి ఆలయంలో అగ్నిగుండ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీధుల్లో విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఉపవాసంతో కంకణధారణ చేశారు. అనంతరం తొమ్మిది స్నానాలు ఆచరించి అర్చకులు మంత్రోచ్ఛరణ మధ్య అగ్నిగుండ ప్రవేశం చేశారు.

కండలేరులో 6.277 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 6.277 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్నేహితుడికి చేయూత



సిరాజ్‌కు నగదు అందజేస్తున్న స్నేహితులు

నాయుడుపేట టౌన్ : అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితుడికి మిత్రులు ఆదివారం ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. నాయుడుపేటలోని రాజగోపాలపురం వీధికి చెందిన సిరాజ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అతని స్నేహితులు అతనికి చేయూత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. రూ.45 వేలను పోగు చేసి ఆదివారం అందజేశారు. అలాగే పట్టణంలో నివాసం ఉంటున్న మరో స్నేహితుడు గోట్టిముక్కల శ్రీనివాసాచార్యులు ఇటీవల మృతిచెందారు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో స్నేహితులు రూ.45 వేలు అందజేయనున్నట్టు తెలిపారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1982లో పదో తరగతి చదివిన వారు కలిసి కట్టుగా ఉంటూ ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారు. వారిని పట్టణ ప్రజలు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆలూరు శ్రీనివాసులు, చిట్టేటి అంకయ్య, శేషం మునిమనోహర్, నిడిగింటి సిద్ధయ్య, హాజీ రహమాత్ బాష, జి.భాస్కర్, కావేరిపాకం శ్రీనివాసులు,ఎం.బాలాజీ పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీపై గ్రామసభలు



గ్రామసభలో వివరాలు తెలియజేస్తున్న ఎస్ఆర్‌పీ రవి

చిల్లకూరు : ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీల్లో భాగంగా ఆదివారం ఉడతావారిపాళెం, కలవకొండ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఉడతావారిపాళెంలో ఉపాధి కింద ఎక్కడెక్కడ ఏయే పనులు చేశారు అన్న విషయాలను వివరించారు. అక్కడ పని చేసిన కూలీలకు పూర్తి స్థాయిలో వేతనం చెల్లించారా లేదా అని తెలుసుకున్నారు. అలాగే కలవకొండ గ్రామ పంచాయతీలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అమృత్ సరోవర్ పనులు, ఇతర పనులపై సోషల్ ఆడిట్ బృందాలు క్షేత్ర సాయిలో పరిశీలించి కూలీల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఉడతా సుభాషిణి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో వివరించారు. ఉడతావారిపాళెం సర్పంచ్ పులి విజయమ్మ, ఏపీవో గిరిబాబు, ఎస్ఆర్‌పీ రవి, టెక్నికల్ ఇంజినీర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కూరగాయలు, కోడిగుడ్లు పంపిణీ



కూరగాయలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు, దాతలు



సరుకులు అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

గూడూరు రూరల్ : పట్టణానికి చెందిన జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు కూరగాయలు, కోడి గుడ్లు అందజేశారు. బనిగేసాహెబ్ పేట వద్ద ఉన్న పెట్రోల్ బంకు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జేవీవీ ఉపాధ్యక్షుడు చెంచునారాయణ మాట్లాడారు. పేదలకు సహాయం చేసేందుకు డాక్టర్ కుడుముల వెంకటనారాయణ ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, రాధయ్య, విజయబాబు, చెంచునారాయణ, సుబ్బారావు, ఆనంద్, సాయికిరణ్, శ్రీనివాసాచారి, తిరకాల శంకరయ్య, సుధీర్ పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

గూడూరు డివిజన్ పరిధిలోని పేదలకు ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆసరా పథకం కింద డాక్టర్ జనార్ధనరెడ్డి, రోహిణి సహకారంతో నిత్యావసర సరుకులు అందజేశారు. సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా 20 మంది పేదలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ప్రాస్పారో స్కూల్ అధినేత దశరథరామిరెడ్డి పేద విద్యార్థి చదువు నిమిత్తం రూ.12 వేల సాయం చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, కిషోర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ సీజ్

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో గ్రావెల్ అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గ్రావెల్‌ను అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు, జేసీబీని ఆదివారం సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ ఓబయ్య, సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎవరైనా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన రోజు నుంచి పలు చెరువుల నుంచి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టినా కట్టడి చేసే దిక్కు లేదు. కూటమి నేతల అక్రమాలు మితిమీరడంతో పోలీసులు జోక్యం చేసుకుని దాడులు చేసినట్లు సమాచారం.

ఆకట్టుకున్న దుర్యోధన వధ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజులుస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రదర్శించిన దుర్యోధన వధ నాటకం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో అలుగు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో ఎస్వీఎస్ఎన్ మూర్తి ఆలయానికి విచ్చేసి, ధర్మరాజులు స్వామి, ద్రౌపదీదేవిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధర్మరాజులుస్వామి ఆలయ ఉత్సవాలు నిర్వహించే అవకాశం తనకు రావడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఎంతో వైభవంగా ఉత్సవాలు నిర్వహించామని తెలిపారు.

ఆశా వర్కర్‌పై కక్ష సాధింపులు తగదు

బాలాయపల్లి (సైదాపురం) : బాలాయపల్లి మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశా వర్కర్ కృష్ణవేణిపై టీడీపీ నేతలు కక్షసాధింపు చర్యలకు పాల్పడడం తగదని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం ఆశా వర్కర్ల తిరుపతి జిల్లా అధ్యక్షురాలు కవిత, బాలాయపల్లి మండల అధ్యక్షురాలు సుహాసిని, గోపెమ్మతో కలిసి స్థానిక పీహెచ్‌సీ వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కృష్ణవేణి 19 సంవత్సరాలుగా ఆశా వర్కర్‌గా పనిచేస్తోందన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించినట్టు వివరించారు. ఇటీవల క్యాన్సర్‌తో తన కుమార్తె మృతి చెందినా ఆమె విధులకు గైర్హాజరు కాలేదని తెలిపారు. అలాంటి వ్యక్తిని విధుల నుంచి తొలగించాలని అధికారులపై ఒత్తిడి తీసుకురావడం దుర్మార్గమన్నారు. కృష్ణవేణి తొలగింపు చర్యలు మానుకోవాలని, లేని పక్షంలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు



మండల పరిషత్ కార్యాలయంలో మూత వేసి ఉన్న మరుగుదొడ్డి



వ్యవసాయశాఖ కార్యాలయం వద్దనున్న మరుగుదొడ్డి వరలపై మూత వేయని దృశ్యం

దక్కిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి నిరుపయోగంగా ఉంది. దీన్ని ఉద్యోగులు, వివిధ పనుల కోసం వచ్చే ప్రజల సౌకర్యం కోసం రూ.లక్ష ఖర్చు చేసి నిర్మించారు. నీటి వసతి కల్పించకపోవడం, పైపులైన్‌ను సక్రమంగా ఏర్పాటుచేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దాన్ని ఎవరూ ఉపయోగించడం లేదు. ఈ క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డికి వరలపైన మూత సక్రమంగా వేయలేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. కార్యాలయానికి వచ్చే రైతులు, ప్రజలు ముక్కులు మూసుకోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితిని నిత్యం అధికారులు చూస్తున్నా పట్టించుకోకపోవడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకుని మరుగుదొడ్లను వినియోగించుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



తడ: మాంబట్టులో గురువులకు సత్కారం



నాయుడుపేట టౌన్ : బాబాకు అలంకరించిన బంగారు హారం

సైదాపురం: మండలంలోని కలిచేడు, చాగణం, సైదాపురం గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

రాపూరులో..

రాపూరు: రాపూరులోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం దగరారాఘవరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దగర పాండురంగారెడ్డి అన్నదానం చేశారు.

మాంబట్టులో..

తడ: మాంబట్టులోని గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ అనుబంధ అన్నపూర్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆరుగురు గురువులను ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో తుర్లపాటి నాగేశ్వరరావు, బాలసరస్వతి దంపతులు అన్నదానం చేశారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్ :నాయుడుపేటలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా చిత్ర పటాన్ని ప్రత్యేక రథంపై కొలువుదీర్చి నగరోత్సవం చేశారు. అంతకుముందు రూ.6 లక్షలతో 120 గ్రాముల బంగారం, నేపాల్ రుద్రాక్షలతో తయారు చేసిన హారాన్ని అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అలాగే అగ్రహారపేట సాయిబాబా మందిరంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. బాబాకు వెండి కిరీటం అలంకరించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కోటలో..

కోట: మండలంలోని విద్యానగర్, కోట, శ్యాంసుందరపురం, తిమ్మనాయుడుపాళెంలోని సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : వెంకటగిరిలోని కుమ్మరిగుంట, పాతబస్టాండ్, హనుమాన్ నగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయాలు, కాలేజీమిట్ట వద్ద ఉన్న బాబా ఆశ్రమంలో గురు పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కర్ణకమ్మ వీధిలో ఉన్న శంకర మఠంలోనూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు.

చిల్లకూరులో..

చిల్లకూరు : మండలంలోని పలు సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. బల్లవోలులో మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. అంకులపాటూరు, చింతవరం, బూదనంలోని సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు.

చిట్టమూరులో..

చిట్టమూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం బాబాకు గ్రామోత్సవం చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

గూడూరు రూరల్‌లో..

గూడూరు రూరల్ : గూడూరు పట్టణం షిరిడీ సాయినగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమిని ఘనంగా జరుపుకున్నారు. బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. చెన్నూరులోని సాయిబాబా ఆలయంలోనూ ప్రత్యేక పూజలు చేశారు.

ఓజిలిలో..

ఓజిలి: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బాబా మందిరాలు ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. మానమాలలోని బాబా మందిరంలో సాయివ్రత రుద్రాభిషేకం చేశారు. మధ్యాహ్నం 1000 మందికి తీర్థప్రసాదాలు అందచేశారు.

వాకాడులో..

వాకాడు : మండలంలోని సాయిబాబా ఆలయాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాకాడు ఆనంద సాయి నిలయంలో ద్రవ్యాభిషేకం, పుష్పాలంకరణ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. దళితవాడలోని బాబా ఆలయం వద్ద బాలయ్య ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



రాపూరు : భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



చిల్లకూరు : బల్లవోలులో భక్తులకు అన్నదానం చేస్తున్న నాయకులు అమరనాథ్‌రెడ్డి